## క్లుప్తంగా

### ముగిసిన రీసర్వే గ్రామ సభలు



గ్రామసభలో అర్జీలు స్వీకరిస్తున్న రెవిన్యూ అధికారులు

హనుమంతునిపాడు: మండలంలో గత నెల 23 నుంచి జరుగుతున్న గ్రామసభలు బుధవారంతో ముగిశాయి. బుధవారం హనుమంతునిపాడులో తహసీల్దార్ దిలీప్‌కుమార్ అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ కె.కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామసభలకు మొత్తం 373 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకంలో పేరు నమోదు కోసం 98, జాయింట్ నిమిత్తం 153, విస్తీర్ణంలో తేడా వచ్చినట్లు 48, సరిహద్దులో తప్పిదాలపై 68, ఇతర విషయాలపై 6 అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు. వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. సర్వేయర్ రమణయ్య, వీఆర్‌ఓ చిన్నయ్య, సచివాలయ సర్వేయర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

### ఉపాధ్యాయ శిక్షణ తక్షణమే రద్దు చేయాలి

సీఎస్‌పురం(పామూరు): ఉపాధ్యాయులు బోధనలో తప్ప మిగిలిన అన్ని విషయాలలో తీవ్రమైన ఒత్తిడి లోనవుతున్నారని ఒత్తిడికి లోనయ్యే పనుల నుంచి తప్పించాలని, తక్షణమే ఉపాధ్యాయుల రెసిడెన్సియల్ శిక్షణ రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్.నాయబ్‌రసూల్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాసులు, జె.ఎస్.ఆనంద్‌బాబు ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. ఇప్పటికే ఒకవైపు అపార్ నమోదు, ఆధాథార్ మిస్‌మ్యాచ్ సమస్యలు, ఎఫ్ఎల్ఎన్, టీచర్‌షిప్ శిక్షణలు, 10వ తరగతి నామినల్‌రోల్స్ ఇలాంటి అనేక బోధనేతర పనులతో ఉపాధ్యాయుల్లో తీవ్రమైన ఒత్తిడి పెంచుతున్న కారణంగా వెంటనే రెసిడెన్షియల్ మోడ్ శిక్షణ రద్దుచేసి అన్ని శిక్షణా కార్యక్రమాలు నాన్ రెసిడెన్షియల్ తరహాలో డివిజన్ కేంద్రాల్లో నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు.

### సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



కంబాలదిన్నె సచివాలయ రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ సురేష్

పామూరు: మండలంలోని కంబాలదిన్నె సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలలను బుధవారం ఎంపీడీఓ బొలినేని సురేష్, ఎంఈఓ గరికపాటి కరుణకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో రికార్డులు పరిశీలించి వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీలు, పెండింగ్ వినతులపై పీఎస్ ఎస్.రాంప్రసాద్, సిబ్బందితో చర్చించారు. అనంతరం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణలో సమయపాలన పాటించాలని, కేంద్రానికి వచ్చే పిల్లల హాజరుశాతాన్ని పెంచాలని సూచించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన మెనూను విధిగా అమలుచేయాలని హెచ్ఎంకు సూచించారు. కార్యక్రమంలో పీఎస్ శింగంపల్లి రాంప్రసాద్, పాఠశాల హెచ్‌యం, ఉన్నారు.

### గుడ్‌టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్సై మాధవరావు

హనుమంతునిపాడు: స్థాని కసూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఎస్సై మాధవరావు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. పాఠశాల పరిసరాల్లో, ప్రయాణాలు చేసేటపుడు, ఇతర వ్యక్తులతో మాట్లాడేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మహిళలపైజరుగుతున్న లైంగిక దాడులు, హత్యలపై అవగాహన కల్పించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. పాఠశాల ఎస్ఓ అంజమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై ఆర్.సుమన్ అన్నారు. స్థానిక కేజీబీవీ విద్యాలయాన్ని బుధవారం రాత్రి ఆయన సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులకు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియాలో పోస్టుల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యార్థుల సేవా కార్యక్రమాలు

సీఎస్‌పురం(పామూరు): జాతీయ సేవా పథకం కార్యక్రమాన్ని గ్రామీణ ప్రజలు, రైతులు ఉపయోగించుకోవాలని కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కదిరి పార్థసారధి అన్నారు. స్థానిక కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.శ్రీవిద్య ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాల 4వ సంవత్సర విద్యార్థులు జాతీయ సేవా కార్యక్రమం చేపట్టగా కార్యక్రమాన్ని కదిరి పార్థసారధి ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులు తయారుచేసిన వానపాములు, ఎరువులు రైతులకు పంపిణీచేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వీరన్నగౌడ్, సర్పంచ్ షేక్.ఖాదర్‌బీబుజ్జి, ఉప సర్పంచ్ టి.బాబూరావు పాల్గొన్నారు.

## సాగునీటి సంఘాల
# ఎన్నికలకు కసరత్తు

- సిద్ధమైన ఓటర్ల జాబితా
- 12, 13 తేదీల్లో పబ్లికేషన్ చేసే అవకాశాలు
- నియోజకవర్గంలో 53 సాగునీటి సంఘాలు
- పదవుల కోసం కూటమిలోని పోటీ నెలకొనే అవకాశం..?



ప్రాంతంలోని సాగు నీటి చెరువులు

కనిగిరి రూరల్: సాగునీటి సంఘాల ఎన్నికలకు రెవెన్యూ శాఖ అధికారులకు కసరత్తు పూర్తి చేశారు. ఎన్నికల ప్రక్రియ నిర్వాహణకు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు సన్నద్ధం అవుతున్నారు. తొలుతగా గ్రామాల్లోని సాగునీటి కాలువలు, చెరువుల కింద ఆయకట్టు భూముల సర్వే నెంబర్లు, రైతుల వివరాలను, పాత జాబితాలోని మార్పులను ఆయా శాఖల అధికారులు సేకరించి నమోదు ప్రక్రియ దాదాపు పూర్తి చేశారు. ఈ నెల 12 లేదా 13 తేదీల్లో జాబితాలను ఇరిగేషన్ శాఖ, పంచాయతీ లేదా అయా కట్టు రైతులు ఉన్న సచివాలయాల్లో జాబితాలను బహిరంగ పరుస్తారు. ఆతర్వాత అభ్యంతరాల స్వీకరణ, ఆయకట్టు దారుల సమావేశం, తుది జాబితా ప్రకటన ఎన్నికల షెడ్యుల్ ప్రకటన జరుగుతుంది. దాదాపు ఈనెల 23, 24 తేదీల్లో ఎన్నికలు జరిగే అవకాశాలున్నట్లు అధికారులు వెల్లడించారు.

**ఆయకట్టు దారులందరికీ ఓటుహక్కు**

చెరువులు, కాలువల కింద భూములు సాగు దారులందరికీ ఓటు హక్కు ఉంటుంది. కనీసం సెంటు భూమి గల రైతుకు కూడా ఓటరుగా ఉంటాడు. మూడేళ్ల నీటి తీరువా చెల్లించి ఉండాలి. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు పదవులకు ఎన్నిక జరుగుతుంది. చెరువుల నిర్వాహణ, అభివృద్ధి, నీటి తీరువా వసూళ్ల, వంటి బాధ్యతలు నీటి సంఘాలకు ఉంటుంది.

**53 మైనర్ చెరువులు, 1 మీడియం**

కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 1 మీడియం (పామూరు మండలం మోపాడు) 53 మైనర్ ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి. 100 ఎకరాల ఆయకట్టు ఉన్న చెరువులన్నింటికీ సాగునీటి సంఘాల ఎన్నికలు జరుగుతాయి. కనిగిరి మండలంలో 13, హెచ్ఎంపాడులో 3, వెలిగండ్లలో 8, పీసీపల్లిలో 10, సీఎస్‌పురంలో 12. పామూరులో 7 సాగునీటి చెరువులు ఉన్నట్లు నివేదికలున్నాయి. వాటి ఎన్నికలు త్వరలో జరగనున్నాయి. నోటిఫికేషన్ విడుదలైన 40 రోజుల్లోగా ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే అవకాశాలున్నాయి.

**ఆ సంఘాల్లో ప్రతిష్టాత్మకం..**

నియోజకవర్గంలో ఒక మీడియం, 7 మైనర్ ఇరిగేషన్ సాగు నీటి సంఘాల్లోని ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా జరిగే అవకాశం ఉంది. కూటమి నేతలకు మరిన్ని పదవులు ఇచ్చేందుకు ప్రభుత్వం ఈ ఎన్నికలను నిర్వహించనుంది. 2015 తర్వాత జరిగే ఈ ఎన్నికలకు కూటమిలోని టీడీపీ, జనసేనా నేతలు పోటీ పడే అవకాశం ఉంది. ఐదేళ్ల పాటు ఉండే పదవీ కాలానికి పోటీ పడేవకాశాలు ఎక్కువే. ప్రధానంగా పామూరు, సీఎస్‌పురం, పీసీపల్లి మండలాల్లో వీరి మధ్య పదవుల కోసం పోటీ జరిగే అవకాశం లేకపోలేదు. నియోజకవర్గంలోని మోపాడు మీడియం, కనిగిరి పెద చెరువు, ఎన్ గొల్లపల్లి, పునుగోడు, హెచ్ఎంపాడులో హాజీపురం, పీసీపల్లిలోని మారెళ్ల, వెలిగండ్లలోని పందువ, సీఎస్‌పురం చెరువులతో పాటు మరి కొన్ని చెరువులకు ప్రతిష్టాత్మకంగా పోటీలు జరిగే అవకాశం ఉంది. అయితే దీనిపై కూటమి పార్టీలోని భాగస్వామ్య పార్టీల సర్దుబాటు జరుగుతుందా.. లేక ఏకపక్షమవుతుందా.. పోటీ జరుగుతుందా అనేది వేచి చూడాల్సి ఉంది.

## పొదుపు మహిళల అక్షరాస్యతే ఉల్లాస్ లక్ష్యం



సదస్సులో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ వెంకటరెడ్డి




మాట్లాడుతున్న రాముని వెంకటేశ్వర్‌రెడ్డి

సీఎస్‌పురం(పామూరు): పొదుపు గ్రూపు సభ్యుల సంపూర్ణ అక్షరాస్యతే ఉల్లాస్ కార్యక్రమ లక్ష్యమని ఎంఈఓ జె.ప్రసాదరావు, అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ ఆర్.వెంకటరెడ్డి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా పొదుపు గ్రూపుల్లోని నిరక్షరాస్యులకు చదువు చెప్పేందుకు ఏర్పాటైన వలంటీర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ, అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్‌లు మాట్లాడుతూ మొదటి విడతగా పొదుపు గ్రూపుల్లో 558 మంది నిరక్షరాస్యులను సర్వేద్వారా గుర్తించి వారికి చదువుచెప్పేందుకు ప్రతి 10 మందికి ఒక వలంటీర్‌ను ఎంపికచేసి మహిళాసమాఖ్య ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన వలంటీర్లు ప్రతిరోజు 10 మందికి సాయంత్రం 2 గంటల పాటు చదువు చెప్పాలన్నారు. వలంటీర్లు పెద్దవారికి చదువు చెప్పాల్సి ఉన్నందున సేవా, ఓర్పు, సహనం కలిగి ఉండాలన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కృపావరం, ఏపీఎం ఎం లక్ష్మీనారాయణ, సీసీలు టి.కాశయ్య, డి.సుబ్రహ్మణ్యం, యం.నారాయణమ్మ, గ్రామస్థాయి వలంటీర్లు పాల్గొన్నారు.

పీసీపల్లి: స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఉల్లాస్ కార్యక్రమంపై యానిమేటర్లకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ ప్రభాకర్‌శర్మ మాట్లాడుతూ నిరక్షరాస్యులు అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఈ కర్యాక్రమం లక్ష్యమన్నారు. ఎంఈఓ శ్రీనివాసచారి మాట్లాడుతూ చదువు అనేది మహిళలకు చాలా అవసరం అన్నారు. వయోజన విద్య పర్యవేక్షకుడు రాముని వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం అంతా డిజిటలైజేషన్ వచ్చిందని, ప్రతి ఒక్కరూ కూడా చదువు అనేది నేర్చుకుంటేనే రానున్న కాలంలో ఇబ్బందులు ఉండవన్నారు. ఏపీఎం సత్యానందం, సీసీలు మహిళలు పాల్గొన్నారు

## తూచ్..మద్యం బాటిళ్లు దొరకలేదే..!

- ఒక్క రోజులోనే మాట మార్చిన ఎక్సైజ్ శాఖాధికారులు
- కేసు నమోదు చేయకుండా వదిలేయడంతో గ్రామంలో బెదిరింపులకు దిగిన బెల్టుషాపు నిర్వాహకుడు
- ఎక్సైజ్ శాఖాధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

సింగరాయకొండ: 'రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదవా..' అన్నట్లు ఉంది ఎక్సైజ్ శాఖాధికారుల తీరు. బెల్టుషాపులపై దాడులు చేయడం...ఇష్టమైతే వదిలేయడం, లేకుంటే కేసులు నమోదు చేయడం పరిపాటిగా మారింది. రెండు రోజుల క్రితం జరిగిన సంఘటనే ఇందుకు నిదర్శనం. కొండపి మండలం పెట్లూరులో బెల్టుషాపు నిర్వహిస్తున్నాడన్న సమాచారంతో ఎక్సైజ్ సీఐ ఎం శివకుమారి సిబ్బందితో అరితోటి వెంకటరావును అదుపులోనికి తీసుకొని నాలుగు మద్యం బాటిళ్లు కూడా స్వాధీనం చేసుకున్నారు. అయితే ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు గానీ అతన్ని పంపించేవారు. ఈ విషయమై అక్కడకు వచ్చిన విలేకరులు ప్రశ్నిస్తే...నాలుగు బాటిళ్లే దొరికాయని, కేసు చిన్నది కావడంతో స్టేషన్ బెయిల్ కోసం సాక్ష్యులను ఏర్పాటు చేసుకోవటానికి పంపించానని, మంగళవారం అతను స్టేషన్‌కు వస్తాడని అప్పుడు కేసు నమోదు చేస్తానని చెప్పారు. అయితే తరువాత రోజు మాత్రం ప్లేట్ ఫిరాయించేశారు. దాడిలో ఎటువంటి బాటిళ్లు దొరకలేదని, అతన్ని హెచ్చరించి వచ్చేశామని బుకాయించారు. దీంతో ఎక్సైజ్ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓ పక్క బెల్టుషాపులపై ఉక్కుపాదం మోపుతామంటూ పత్రిక ప్రకటనలు ఇస్తూ..మరో పక్క ఇటువంటి ద్వంద వైఖరి అవలంబించడం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి వెంకట్రావును సోమవారం ఎక్సైజ్ అధికారులు విడిచిపెట్టిన తర్వాత అతను గ్రామానికి వెళ్లి నాపైనే ఫిర్యాదు చేస్తారా..మీ అంతు చూస్తానని కత్తి తీసుకొని చుట్టు పక్కల వారిపై దాడిచేసే ప్రయత్నం చేసినట్లు సమాచారం. వాస్తవానికి ఎస్సీ కాలనీ సమీపంలో కొంత మంది స్థలం ఆక్రమించే ప్రయత్నం చేశారు. బాధితులు కోర్టును ఆశ్రయించగా రెవెన్యూ అధికారులు ఆ స్థలంలో బోర్డులు ఏర్పాటు చేశారు. కానీ ఈ బెల్టుషాపు నిర్వాహకుడు దర్జాగా ఆ స్థలంలోనే బెల్టుషాపు నిర్వహిస్తున్నాడు. అయినా రెవెన్యూ, పోలీసులు, ఎక్సైజ్ శాఖాధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

## తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి



పీసీపల్లి: మాట్లాడుతున్న ఏడీఏ వెంకటరమణ



రైతులకు సూచనలిస్తున్న ఏఓ సంపత్‌కుమార్

సీఎస్‌పురం(పామూరు): కంది, వరిపైర్లను ఆశించే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ బి.సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని బాలుపల్లి, ముండ్లపాడు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. కంది, వరి పైర్లను ఆయన రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పూతదశలో ఉన్న కందిలో వేప నూనె లీటరు నీటికి 2.5 ఎంఎల్, ప్రొఫెనోఫాస్ లీటరునీటికి 2.5 ఎంఎల్ పిచికారీ చేయాలన్నారు. వరిలో జింక్ సల్ఫేట్ లీటరు నీటికి 2.5 ఎంఎల్ పిచికారీ చేయాలని సూచించారు. ఏఈఓ పి.శ్రీనివాసులు, ఎంపీఈఓ పి.రవి, జి.రామశారద, షేక్.పర్వీన్‌బేగమ్, వీఏహెచ్ యం.నవీన్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: రైతులు అధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడిని పొందాలని వ్యవసాయాధికారి పి.జోత్స్నాదేవి అన్నారు. మండలంలోని గుడిపాడు, తాళ్లూరు రైతు భరోసా కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తోంది నిర్వహించారు. రబి సీజన్‌లో వరి పైరులో మొదటి దఫాగా ఎరువులు వేసేటప్పుడు తప్పనిసరిగా మ్యూరేటాఫ్, పొటాష్‌ను 20 నుంచి 25 కేజీలు వరకు చల్లు కోవాలని తెలిపారు. పొటాష్ ఎరువు వేయడం వలన పైరుకు రోగ నిరోధక శక్తి అంది చీడపీడలను తట్టుకునే శక్తి వస్తోందన్నారు. ఏపీఎంఐపీ ఏఐఏఓ సత్య ప్రసాద్, ఏఎంసీ సిబ్బంది జి.లక్ష్మీ, వ్యవసాయ సహాయకులు జీవీ సుబ్బారావు, ఎంపీఈఓ యోగేశ్వరి, పశువర్ధక సహాయకులు ఎం కృష్ణా, కిరిటీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పీసీపల్లి: మిర్చి సాగు చేసే రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ వెంకట రమణ అన్నారు. మండలంలోని పెద్ద అలవలపాడు, ముద్దపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎప్పటికప్పుడు పంట మార్పిడి చేస్తే తెగుళ్ల బారి నుంచి కాపాడవచ్చన్నారు. సేంద్రియ పద్ధతుల్లో పంట పండిస్తే దిగుబడి అధికంగా వస్తుందన్నారు. పొగాకు పంట తగ్గించి మిగిలిన పంటలు అధికంగా సాగు చేయాలన్నారు.

హనుమంతునిపాడు: పంటలు సాగు చేసిన రైతులు స్వల్ప మొత్తంలో చెల్లించి పంటలకు బీమా సౌకర్యం పొందాలని వ్యవసాయ శాఖ ఏఓ కె.రమణ అన్నారు. మండలంలోని ఉమ్మనపల్లి, పెద్దగొల్లపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు డిసెంబర్ 15 లోగా బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. పొగాకుకు ప్రత్యామ్నాయంగా అలసంద, మినుము, కంది, ఇతర పంటలు సాగు చేయాలన్నారు. హెచ్ఓ ఎం.అంజలీబాయి, వీఏఏలు కల్యాణి, ఆర్ సుప్రియ, రైతులు పాల్గొన్నారు.

టంగుటూరు: వరిలో ఆకుముడత పురుగు నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారి స్వర్ణలత అన్నారు. మండలంలోని వల్లూరు, సూరారెడ్డిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. వెటర్నరీ వైద్యులు విజయమాధవి మాట్లాడుతూ పశు గణన నిర్వహిస్తున్నామని, పశువులు ఉన్న వారు నమోదు చేయించుకోవాలన్నారు. నట్టల నివారణ మందు, గొంతు వాపు వ్యాధికి టీకాలు వేయించుకోవాలన్నారు.

కొండపి: మండలంలోని పెద్దకండ్లగుంట, జాళ్లపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. వ్యవసాయాధికారి డి.విజయ్‌కుమార్ తెగుళ్ల నివారణ, ప్రత్యామ్నాయ పంటల సాగు, సబ్సిడీ శనగ విత్తనాల గురించి వివరించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు మహేష్, రైతులు పాల్గొన్నారు.

మర్రిపూడి: మిరప రైతులు తెల్లదోమలతో అప్రమత్తంగా ఉండాలని దర్శి సహాయ వ్యవసాయ సంచాలకురాలు బాలాజీనాయక్ అన్నారు. మండలంలోని పన్నూరు, వల్లాయపాలెం గ్రామాల్లో బుధవారం బొప్పాయి, మిరప పంటలను పరిశీలించారు. ఏఓ సీహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ రైతులకు 25 శాతం సబ్సిడీపై శనగ విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఉద్యానవన విస్తరణాధికారి ధనలక్ష్మీ మాట్లాడుతూ రాయితీపై డ్రిప్‌లు, స్ప్రింకర్లు అందజేస్తామన్నారు. పలు శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలి



నర్సరీలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త వెంకటేశ్వరరావు

కొండపి: పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని శాస్త్రవేత్త పి. వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని కామేపల్లి, పైడిపాడు గ్రామాల్లో పొగాకు రైతులకు పంట ఉత్పత్తి నియంత్రణ , పొగాకు పంట ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా నల్లరేగడి నేలలో శనగ, మినుము, కంది, బొబ్బర్లు తదితర పంటలు సాగు చేయాలని సూచించారు. ఎండు తెగులు, పల్లాకు తెగులు, తుప్పు తెగులు మొదలగు చేయడం తట్టుకునే రకాలను సాగు చేసుకోవాలని అన్నారు. కొండపి వేలం నిర్వహయాధికారి జి.సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచంలో వివిధ దేశాల్లో పండిస్తున్న పొగాకు ఉత్పత్తిని, పరిమాణాన్ని రైతులకు తెలియజేశారు. అధిక ధరలకు బ్యారెన్లు పొలాలు, కౌలుకు తీసుకోవద్దని సూచించారు. రైతులు బోర్డు సూచించిన పరిమితి మేరకే పొగాకు పండించాలన్నారు. సిఫార్సు చేసిన అధిక దిగుబడి ఇచ్చే వంగడాలు రైతులు మాత్రమే సాగు చేయాలని అన్నారు. ముందుగా పైడిపాడు, చతుకుపాడు, కామేపల్లి గ్రామాల్లోని పొగాకు నర్సరీలను సందర్శించారు. కార్యక్రమంలో ఐటీసీ మేనేజర్ చంద్రశేఖర్ రెడ్డి, పోలిశెట్టి మేనేజర్ ఎ. రామాంజనేయులు, సర్పంచ్ భాస్కర్, పొగాకు బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా కృషి చేయండి

- డీఆర్‌డీఏ పీడీ వసుంధర



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ వసుంధర

సింగరాయకొండ: డ్వాక్రా మహిళల అర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వ పథకాల లబ్ధి అందజేసి ఆర్థికంగా బలోపేతం చేయటానికి కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ వసుంధర మండలస్థాయి అధికారులకు సూచించారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో బుధవారం ఆరుమండలాల అధికారులతో నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. పీడీ వసుంధర మాట్లాడుతూ అధికారులు ముఖ్యంగా స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ రుణాలు అర్హులైన ప్రతి మహిళకు అందజేయటమే కాక రికవరీలో కూడ సక్రమంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రుణాలు తీసుకున్న లబ్ధిదారులు యూనిట్లు ఏర్పాటు చేయాలన్నారు. నిధులు పంపిణీలో అవినీతికి తావు లేకుండా చూడాలని సూచించారు. రుణాల రికవరీలో సింగరాయకొండ మండలం నియోజకవర్గంలో ప్రథమ స్థానంలో ఉందని, ఇదే ఒరవడిని అన్ని మండలాలు కొనసాగించాలని సూచించారు. టంగుటూరు మహిళా మార్ట్‌లో సుమారు రూ.5 లక్షలకు పైగా నిధులు రికవరీ కావాల్సి ఉందన్నారు. నిధుల గోల్‌మాల్‌కు సంబంధించి ఒక సీసీ కూడా సస్పెండ్ చేశామన్నారు. ప్రస్తుతం జెడ్పీ డిప్యూటీ సీఈఓ పి.బాలమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ వేశారని, కమిటీకి మహిళా మార్ట్ రికార్డులు అందజేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. స్త్రీనిధి ఏజీఎం హర్షవర్ధన్, ఉన్నతి ఏపీఎం సుబ్రమ్మణ్యం, ఏరియా కో ఆర్డినేటర్ కత్తి కళ్యాణ్, ఏపిఎంలు భాగ్యలక్ష్మి, డి.జయరాజ్, గోపీనాథ్, కోటేశ్వరరావు, శ్రీనివాసులు, సుబ్బారావు, సీసీ, వీఓఏలు పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

టంగుటూరు: టంగుటూరు విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఆక్వా రైతులకు తిప్పలు తప్పడం లేదు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని అనంతవరం, ఆలకూరపాడు, తాళ్లపాలెం, వెలగపూడి, వెంకటాయపాలెం పరిధిలో 1000 హెక్టార్లలో ఆక్వా రైతులు సాగు చేస్తున్నారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైన సమయంలో వెలగపూడి సబ్‌స్టేషన్‌లో అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించేందుకు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఉంచడం లేదు. దీంతో పాత ట్రాన్స్‌ఫార్మర్‌కే తాత్కాలిక మరమ్మతులు చేసి మళ్లీ బిగిస్తున్నారు. కానీ మళ్లీ రెండు రోజులకే ఆ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురవుతుండటంతో ఆక్వా రైతులు తీవ్ర ఇక్కట్లు గురవుతున్నారు. దీనిపై విద్యుత్ ఏఈ రామకృష్ణకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఫోన్ చేసినా స్పందించరని ఆక్వా రైతులు మండిపడుతున్నారు. ప్రస్తుతం ఆక్వా సాగులో తెగుళ్లతో రైతులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ పరిస్థితుల్లో విద్యుత్ సమస్య మరిన్ని కష్టాలు తెచ్చిపెడుతుందని అంటున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖాధికారులు స్పందించకుంటే విద్యుత్ సమస్య కారణంగా లక్షలాది రూపాయల నష్టం వాటిల్లే అవకాశం ఉంటుందని వాపోతున్నారు.

### ధరలు తగ్గించడంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి మాల్యాద్రి

పామూరు: నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించడంలో రాష్ట్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో బుధవారం సీపీఎం మండల కమిటీ సమావేశం సయ్యద్‌గౌస్‌బాషు అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా మండల కార్యదర్శి మాల్యాద్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ప్రజలపై నిత్యావసరాలు, విద్యుత్‌చార్జీలపెంపు, ఇతర వస్తువుల ధరలతో మోయలేని భారాన్ని మోపుతోందన్నారు. ఉచిత ఇసుక పథకం ఆచరణలో అభాసుపాలైందని, ఇసుక అందక కూలీలు జీవనం భారంగా మారిందన్నారు. బాలికలు, మహిళలపై అత్యాచారాలు నానాటికీ పెరుగుతున్నాయని, మద్యం బెల్టు దుకాణాలద్వారా ఏరులై పారుతోందన్నారు. ఎం.రామయ్య, షేక్.ఖాదర్‌బాషా, కె.శంకర్, యాట వీరనారాయణ, ఎస్‌కే.అల్లాబక్షు, పలువురు సీపీయం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


### రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కనిగిరి రూరల్: స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు పట్టణంలోని చింతలపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 2న జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాల గోట్లగట్టులో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్ 14–17 విభాగాల్లో చింతలపాలెం పాఠశాలకు చెందిన బాల బాలికలు జిల్లా స్థాయి రగ్బీ సెలక్షన్స్‌లో ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎం అక్షర, ఎం కీర్తి, ఎం లక్ష్మీ ప్రసన్న, కె.నిత్యశ్రీ (7వ తరగతి), కేవీ మజ, (8వ తరగతి) ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 9,10 తేదీల్లో కడప జిల్లా కమలాపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. ప్రతిభ చాటిన విద్యార్థినులకు హెచ్‌ఎం కేవీ రామశర్మ, వ్యాయామ ఉపాధ్యాయురాలు కె.శ్రీదేవి, ఉపాధ్యాయులు కేవీ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ అభినందించారు.

### ప్రజా పోరుకు సిద్ధంకండి



మాట్లాడుతున్న పూనాటి ఆంజనేయులు

కొండపి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ధరలభారాలు, మహిళలు, చిన్నారులపై పెరుగుతున్న అకృత్యాలకు వ్యతిరేకంగా నవంబర్ 8 నుంచి 14 వరకు జరిగే ప్రజాపోరులో పాల్గొనాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పూనాటి ఆంజనేయులు పిలుపునిచ్చారు. సీపీఎం మండల ఏడో మహాసభలు బుధవారం కొండపిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ప్రజలపై కేంద్రం మోయలేని భారం మోపుతుందన్నారు. రాజధాని నిర్మాణానికి నిధులు ఇవ్వకుండా అప్పులు ఇప్పిస్తామనటం, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ అమ్మకానికి పెట్టడం లాంటి చర్యలను సీపీఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ముందుగా పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు గడ్డం పిచ్చయ్య ఆవిష్కరించారు. ఇటీవల మరణించిన సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి ముప్పరాజు లక్ష్మమ్మ పూలమాలవేసి, అమరవీరులకు నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు, కమిటీ సభ్యులు శ్రీనివాసులు రమాదేవి, మండల కార్యదర్శి కేజీ మస్తాన్, కొండయ్య, చిన్న బ్రహ్మయ్య, రూబెన్, వందనం, చిన్న పేతురు, రామారావు,పరిశుద్ధం, సుకన్య, సుధాకర్, శ్రీను,సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.


### కుటుంబాన్ని పోషించుకోలేకపోతున్నాం



వినతిపత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు

మర్రిపూడి: మూడు నెలలుగా జీతాలు లేకపోవడంతో కుటుంబాన్ని పోషించుకోలేకపోతున్నామని, జీతాలు ఇప్పించాలని 104 ఉద్యోగులు వేడుకున్నారు. ఈ మేరకు కాకర్ల పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో 104 సిబ్బంది కాకర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఎన్ సాయి రుచితకు వినతిపత్రం అందజేశారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా రూ.50 వేలు ఖర్చుతో నిర్వహించి ప్రజాధనం వృథా కాకుండా చూడాలన్నారు. 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈఓలకు జీఓ 7 ద్వారా వేతనం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో డీఈఓ చిరంజీవి, డ్రైవర్ శివ పాల్గొన్నారు.

### చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీఐ హజరత్తయ్య

టంగుటూరు: చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీఐ చావా హజరత్తయ్య అన్నారు. సీఐడి సీఐ వెంకటేశ్వర్లు, సీఐడీ ఎస్సై ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ నిరోధక చట్టంపై స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ చట్టాలపై అవగాహన లేకే సమాజంలో అవాంఛనీయ సంఘటనలు జరుగుతున్నాయన్నారు. సీఐ హజరత్తయ్య మాట్లాడుతూ అట్రాసిటీ కేసు నమోదైతే డీఎస్పీ స్థాయి అధికారతో విచారణ చేయించి చర్యలు తీసుకుంటామన్నారు. మాల ఉద్యోగ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగాన్ని చదివితే చట్టాలు, హక్కులు తెలుస్తాయన్నారు. టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు, ఎంఈఓ తన్నీరు బాలాజీ, జైభీమ్‌రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేవీ కృష్ణారావు,వై ఉజ్వల్, కృష్ణయ్య, కొమ్ము ప్రభుదాసు, బ్రహ్మయ్య, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

### వృథా..వృథ



పైప్‌లైన్ నుంచి వృథాగా పోతున్న నీరు

టంగుటూరు: మండలంలోని జమ్ములపాలెం గ్రామ సమీపంలో కొండపి నుంచి టంగుటూరు పైపు వెళ్లే మంచినీటి పైప్‌లైన్ లీకై వారం రోజులుగా నీరు వృథాగా పోతున్నాయి. అసలే గ్రామాల్లో నీటి కొరత ఏర్పడి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పైప్‌లైన్ లీకై నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.